జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 8 | నవంబర్ | 2026 • పేజీలు : 8

ఎస్ ఐ ఆర్-లో అర్హులై ఉండి డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు నమోదు కాని వారికి మరో అవకాశం



నవంబర్ 21 వరకుఎన్యుమరేషన్ ఫారాలు అందజేయవచ్చు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 7,(ప్రజా జ్యోతి) ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా వివిధ కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు

మిగతా 2 లో...

- ఏళ్ల తరబడి సేవలం దిస్తున్నా ఉద్యోగ భద్రతపై నమ్మకం కరువు
- ప్రతి ఏడాది ఒప్పందం పునరుద్ధరణతో ఉద్యోగుల భవిష్యత్తుపై ఆందోళన
- ఒకే వైద్య సేవలు.. శాశ్వత ఉద్యోగులతో పోలిస్తే వేతనాల్లో భారీ వ్యత్యాసం
- బీమా, ప్రసూతి సెలవులు, ఇతర ప్రయోజనాలకూ దూరమేనంటూ ఆవేదన
- ఇంక్రిమెంట్లు, ప్రోత్సాహకాల అమలులోనూ అన్యాయం జరుగు తోందని ఆరోపణ
- ఉద్యోగాల క్రమబద్ధీకరణతో పాటు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్
- తుఫానునూ సైతం లెక్కచేయకుండా 10 రోజులనుండి భద్రాద్రిలో కొనసాగుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నా



ఏటా రెన్యూవల్..
జీవితాంతం అభద్రత!

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి నవంబర్ 07, ప్రజాజ్యోతి : ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వ వైద్యశాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ ఎం) ఉద్యోగుల జీవితాల్లో మాత్రం భద్రత కరువైంది.ఏళ్ల తరబడి సేవలం దిస్తున్నా ఉద్యోగం ఉంటుందో లేదో తెలియని పరిస్థితి..ప్రతి ఏడాది ఒప్పం దాన్ని రెన్యూవల్ చేసుకోవాల్సిన అని శ్చితి.. శాశ్వత ఉద్యోగులతో పోలిస్తే వేతనాలు, సౌకర్యాల్లో వ్యత్యాసం.. వెరసి తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిం చాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా గత నెల 13 నుంచి ఉద్యోగులు నిరసన బాట పట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గత నెల 27 నుంచి జిల్లా కేంద్రంలో ధర్నా శిబిరం (కలెక్టరేట్ పక్కన) ఏర్పాటు చేసి ఆందోళన కొన సాగిస్తున్నారు.

ఉద్యోగ భద్రతపై నమ్మకం కరువు..

జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో స్పెష లిస్ట్ వైద్యులు, ఎంబీబీఎస్ వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ల్యాబ్ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు మొదలుకొని వివిధ కేడర్లకు చెందిన ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,541 మంది 78 కేడర్లలో పనిచేస్తున్నట్లు ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి. భద్రాద్రి జిల్లాలోనూ 670 మందికి పైగా ఉద్యోగులు సేవలందిస్తున్నట్లు సంఘాల

మిగతా 2 లో...

డైవర్షన్ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే జారె



- రూ.20 లక్షలతో తాత్కాలిక రహదారి నిర్మాణం
- రెండు రోజుల్లో రాకపోకలకు అందుబాటులోకి తెస్తాం
- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి

ములకలపల్లి, నవంబర్ 7 (ప్రజా జ్యోతి): మురసు తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మూకమా మిడి–మొగరాలగుప్ప గ్రామాల మధ్య వంతెన తెగిపోవడంతో ప్రజలు ఎదు ర్కొంటున్న ఇబ్బందులను తొలగించేం దుకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చొరవ తీసుకున్నారు. రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న తాత్కాలిక డైవ ర్షన్ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వంతెన తెగిపోవడంతో రెండు గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, విద్యార్థులు, రైతులు నిత్యం ఈ మార్గంపైనే ఆధార పడుతున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆలస్యం చేయ కుండా డైవర్షన్ రోడ్డు పనులు ప్రారం భించామన్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబా టులోకి తీసుకొస్తామని, శాశ్వత వంతెన నిర్మాణానికి కూడా త్వరితగ తిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ..

మిగతా 2 లో...

డబ్బులు ఇవ్వట్లే.. అందుకే ట్యాంక్ ఎక్కినా...!

- గుండ్ల సింగారం ఇసుక రీచ్ లో దారుణం..
- కూలీ డబ్బులు ఎగ్గొట్టిన నిర్వాహకులు..!
- మణుగూరు గాంధీ బొమ్మ సెంటర్ లో టెన్షన్...
- ట్యాంక్ పై నుంచి దిగని శేషగిరి..!
- తల్లి కన్నీరు.. స్థానికుల బతిమాలు.. అయినా వినని బాధితుడు..!



- రంగంలోకి దిగిన సీవి నాగబాబు.. చాకచక్యం గా కాపాడి న్యాయం చేస్తా నని హామీ..!

2 లో...

రాత్రి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్ట్

- రూ. 27.51 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం -
- వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



ఇల్లందు, నవంబర్ 7 (ప్రజా జ్యోతి) వరుస రాత్రి దొంగతనాలకు పాల్పడు తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 27.51 లక్షల విలువైన బంగారం, వెండి వస్తు వులను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. శని వారం ఇల్లందు పోలీస్ స్టేషన్‌లో ఏర్పా టుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. ఇల్లందు పట్టణంలో గత కొంతకా లంగా తాళం వేసి ఉన్న ఇండ్లను లక్ష్యంగా చేసుకొని రాత్రి వేళల్లో దొంగ తనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను ఇల్లందు పోలీసులు చాక చక్యంగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా ఇల్లందులోని జెకె కాలనీ ,సుభాష్ నగర్, ఆజాద్ నగర్, వెంగళ్ రావు నగర్ తదితర ప్రాంతాల్లో మొత్తం 10 ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించి నట్లు పేర్కొన్నారు. దీంతో పది కేసు లను ఇల్లందు పోలీసులు చేదించినట్లు తెలిపారు. అరెస్టయిన వారిలో లోద్ విశాల్ కుమార్ (24), గౌతమ్ లోధ్ (26), కోరి కళ్యాణ్ (20) ఉన్నారని, వీరు ఇల్లందులోని 14వ, 15వ నెంబర్ బస్తీలకు చెందిన వారిగా పోలీసులు వెల్లడించారని పేర్కొన్నారు. అరెస్ట్ అయిన వారిలో

మిగతా 2 లో...

ఏటా రెన్యూవల్.. జీవితాంతం అభద్రత!

(మొదటి పేజీ తరువాయి...)

ప్రతినిధులు చెబుతున్నారు. గర్భిణుల సంరక్షణ, చిన్నారులకు టీకాలు, వ్యాధుల గుర్తింపు, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు వంటి కీలక బాధ్యతలను వీరు నిర్వహిస్తున్నారు. అయితే ఎన్నో ఏళ్లుగా నిరంతరం విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రతి ఏడాది ఉద్యోగ ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవాల్సి వస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా రెన్యూవల్ ప్రక్రియపై ఆధారపడాల్సి రావడంతో తమ ఉద్యోగం కొనసాగుతుందో లేదోనన్న భయం వెంటాడుతోందని చెబుతున్నారు. దీంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, భవిష్యత్తు అవసరాలపై ఈ అనిశ్చితి ప్రభావం చూపుతోందని వాపోతున్నారు. అందుకే దీర్ఘకాలంగా సేవలందిస్తున్న వారికి కనీసం ఉద్యోగ కొనసాగింపుపై భరోసా కల్పించాలని కోరుతున్నారు.

ఒకే విధులు.. వేతనాలు, సౌకర్యాల్లో వ్యత్యాసం?

ఒకే ఆసుపత్రిలో శాశ్వత ఉద్యోగులతో సమానమైన బాధ్యతలు నిర్వహిస్తున్నా తమకు అందే వేతనాల్లో భారీ వ్యత్యాసం ఉందని ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది చెబుతున్నారు. శాశ్వత ఏఎన్‌ఎంకు సుమారు లక్ష రూపాయల వరకు వేతనం అందుతుంటే, అదే తరహా విధులు నిర్వహించే తమకు సుమారు రూ.25 వేలే వస్తున్నాయని ఉదాహరణగా పేర్కొంటున్నారు. ఇక్కడ హోదా, అనుభవం, సర్వీసు నిబంధనల ఆధారంగా వేతనాలు మారుతున్నప్పటికీ సమాన పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. శాశ్వత ఉద్యోగులకు అందుతున్న ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, కుటుంబానికి ఆర్థిక భరోసా, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు వంటి సౌకర్యాలు తమకు కూడా కల్పించాలని కోరుతున్నారు. ఉద్యోగి మరణిస్తే కుటుంబానికి అండగా నిలిచే విధానం ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నెలవారీ వేతనాలు కూడా సమయానికి అందడం లేదని, వార్షిక ఇంక్రిమెంట్లు, ప్రోత్సాహకాలు అమలు కావడం లేదని ఆరోపిస్తున్నారు. వితిది పాటు వాళ్ళకు హక్కుగా రావాల్సిన ఐదు శాతం వార్షిక ఇంక్రిమెంట్, ఎనిమిది శాతం లాయల్టీ బోనస్ సహా తమ డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించాలని కోరుతున్నారు.

క్రమబద్ధీకరణతోనే భవిష్యత్తుకు భరోసా..

ఉద్యోగాలను క్రమబద్ధీకరించి శాశ్వత భద్రత కల్పించాలన్నది తమ ప్రధాన డిమాండ్ అని ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు. హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, మహారాష్ట్ర, అరుణాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను పరిశీలించి తెలంగాణలోనూ తగిన విధానం అమలు చేయాలని కోరుతున్నారు. ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ ఎన్‌హెచ్‌ఎం సమస్యలపై పరిశీలన జరుగుతోందని సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో కొనసాగుతున్న ధర్నా శిబిరంలో ఇటీవల తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసినా ఉద్యోగులు వెనక్కి తగ్గకుండా నిరసన కొనసాగించారు. వాతావరణ పరిస్థితులను సైతం లెక్కచేయకుండా తమ డిమాండ్ల సాధన కోసం శిబిరంలోనే బైఠాయించారు. ఏదేమైనా ప్రజారోగ్యవ్యవస్థలో కీలకంగా పని చేస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వం త్వరితగతిన చర్చలు జరిపి పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఏళ్ల తరబడి సేవలందిస్తున్న ఉద్యోగులకు ప్రతి ఏడాది రెన్యూవల్ భయాన్ని తొలగించి, వేతనాలు, బీమా, ఇతర సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. ఇక ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే సిబ్బంది జీవితాలకు భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

ధర్నా కొనసాగిస్తాం.. ; అబ్దుల్ రెహమాన్ (జిల్లా కోఆర్డినేటర్)

రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకే జిల్లాలో ధర్నా కొనసాగిస్తున్నాం. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదు. ప్రభుత్వం మా ఉద్యోగ భద్రతకు స్పష్టమైన హామీ ఇవ్వాలి. మా సమస్యలపై చర్చించేందుకు ప్రతినిధులను పిలవాలి లేదా లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలి. ఈ అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన స్పందన వచ్చే వరకు ధర్నా కొనసాగిస్తాం.

ఎస్ ఐ ఆర్-లో అర్హులై ఉండి డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు నమోదు కాని వారికి మరో అవకాశం

(మొదటి పేజీ తరువాయి...)

కోల్పోకుండా విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్నిజిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, ఓటరు జాబితాలో పేర్ల నమోదు తదితర అంశాలపై సమీక్షించారు.కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఐడీఓసీ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం తదితర కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తెలిపారు. అర్హులై ఉండి ఓటరు జాబితాలో పేరు లేని వారు మరోసారి తమ ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ నెల 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించవచ్చని తెలిపారు. ఇప్పటికే ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన కేటగిరీ ఓటర్ల వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాల రూపంలో ప్రదర్శించాలని ఆదేశించారు.ఓటర్లు తమ పాత ఎపిక్ నంబర్ ఆధారంగా భారత ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్, ఈ సీఇ నెట్ యాప్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని సమర్పించవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా అధికారులు సమన్వయంతో పని చేయాలని, అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా అవసరమైన అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాత్రి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్ట్





(మొదటి పేజీ తరువాయి...)

ఇద్దరు పేజీ చదువుతున్నారని, ఈజీ మనీకి అలవాటు పడి దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి165 గ్రాముల బంగారం ఆభరణాల విలువ సుమారు రూ.23.10 లక్షలు, వెండి 2 కిలోల 205 గ్రాముల విలువ సుమారు రూ.4.41 లక్షలు ఉంటుందన్నారు. వీటితో పాటు ఒక ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. పట్టణంలోని ప్రతి లైన్ లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను గుర్తించి దొంగలు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. పండుగలు, వివిధ కార్యక్రమాలకు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు వారి ఇండ్లలో విలువైన వస్తువులను వెంట తీసుకుని వెళ్లాలని సూచించారు. అదేవిధంగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్కు సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలో గస్తీ ముమ్మరం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కేసులో నిందితులను పట్టుకునేందుకు నిఘా పెట్టి, 99 శాతం బంగారం, వెండి వస్తువులను రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా ఇల్లందు డిఎస్పి, సీఐ, పోలీస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కేసును చేదించడంలో క్రైమ్ కానిస్టేబుల్ రవికుమార్ చేసిన కృషికి గాను అభినందించి రివార్డు అందజేశారు. ఈ సమావేశంలో ఇల్లందు డిఎస్పి యు వెంకన్న బాబు, సీఐ తాటిపాముల సురేష్, ఎస్సైలు సారంగపాణి, ఉమా, సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వట్లే.. అందుకే ట్యాంక్ ఎక్కినా...!







భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు, నవంబర్ 7, ప్రజాజ్యోతి: గుండ్ల సింగారం ఇసుక రీచ్ నిర్వాహకులు ఆరు నెలలుగా చేసిన పనికి డబ్బులు చెల్లించలేదని ఆవేదన తో ఓ కార్మికుడు వాటర్ ట్యాంక్ ఎక్కిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం గాంధీ బొమ్మ సెంటర్ సమీపంలో చోటుచేసుకుంది. ఈ ఘటన ఒక్కసారిగా అందరిని కలవర పెట్టింది. స్థానికుల వివరాలు ప్రకారం బాధితుడు శేషగిరి గుండ్ల సింగారం ఇసుక ర్యాంపులో గత ఆరు నెలలుగా పనిచేశాడు. అయితే తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని ఇసుక ర్యాంపు నిర్వాహకులను ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేదని తెలిపారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శేషగిరి వాటర్ ట్యాంక్ ఎక్కి తనకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశాడని స్థానికులు వాపోయారు. విషయం తెలుసుకున్న అతని తల్లి అక్కడికి చేరుకుని కిందకు దిగాలని బతిమాలారు. అయినా శేషగిరి వినలేదని చెప్పుకోచ్చారు. ఇక లాభం లేక సమాచారం అందుకున్న మణుగూరు సీఐ నాగబాబు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితుడితో పలుమార్లు మాట్లాడి డబ్బులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఆత్మహత్య పరిష్కారం కాదని ప్రేమతో సూచించారు. అయినా శేషగిరి కిందకు దిగలేదు. దీంతో సీఐ నాగబాబు చాకచక్యంగా వ్యవహరించి బాధితుడిని పట్టుకుని సురక్షితంగా సిబ్బంది సహాయంతో వాటర్ ట్యాంక్ పై నుంచి కిందకు దింపారు. అనంతరం ఇసుక రీచ్ వద్ద రావాల్సిన డబ్బును ఇప్పిస్తానని బాధితుడికి హామీ ఇచ్చారు. అంతేగాక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇవ్వమని సూచించారు. బాధితుడిని కాపాడిన సీఐ నాగబాబు పట్ల స్థానికులు, శేషగిరి తల్లి హర్షం వ్యక్తం చేశారు.

డైవర్షన్ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే జారె



(మొదటి పేజీ తరువాయి...)

వంతెన తెగిపోయినప్పటి నుంచి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే స్వయంగా వచ్చి పరిశీలించి, వెంటనే స్పందించి డైవర్షన్ రోడ్డు పనులు ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల తరపున ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే త్వరితగతిన స్పందించడంపై గ్రామస్తులు, రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్, జిల్లా నాయకులు, ములకలపల్లి మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి దోమల అరుణ్ కుమార్, కారం సుధీర్, వార్డు సభ్యులు కీసరి రాజ్ కుమార్, బచ్చల చైతన్య కుమారి, మాజీ ఎంపీటీసీ తాటి తులసి, నాయకులు కీసరి వెంకటేశ్వర్లు, వెంకట్రావు, గోపాలరావు, బాబురావు, గోపయ్య, అనంతల సత్యనారాయణ, మొత్తం శ్రీను, కాకా బాబురావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లపై అధికారుల కొరడా...!

- వంటగదిలో బొద్దింకలు.. కుళ్లిన ఆహారం.. చూస్తే వాంతులే..!
- 4 ప్రత్యేక బృందాలతో మెరుపు తనిఖీలు.. హోటల్ యజమానుల్లో వణుకు..!
- కొన్ని హోటళ్లకు సీల్.. మరికొన్నింటికి షోకాజ్ నోటీసులు..?





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. నవంబర్ 7, ప్రజాజ్యోతి : –

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు హోటళ్లు, తినుబండారాల కేంద్రాల్లో టీజీ ఎస్ఏఎఫ్ఈ ఫుడ్ సేఫ్టీ విభాగం శనివారం మెరుపు తనిఖీలు చేపట్టింది. నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాడి జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో తనిఖీలు నిర్వహించడంతో హోటల్ యజమానుల్లో కలకలం రేపింది. పలు హోటళ్లలో అపరిశుభ్ర వంటగదులు, సరైన నిల్వ సదుపాయాలు లేకపోవడం అధికారులు గుర్తించారని తెలుస్తోంది. కొన్ని హోటళ్లలో బొద్దింకలు, ఇతర కీటకాలు కనిపించడంతో అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార పదార్థాల తయారీ, పరిశుభ్రత విషయంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపించిందని తెలిపారు. తప్పనిసరిగా నిర్వహించాల్సిన పెస్ట్ కంట్రోల్ చేయకపోవడం గుర్తించారు. సిబ్బంది ఆరోగ్య రికార్డులు కూడా లేకపోవడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. తయారీ తేదీలు లేని ఆహార పదార్థాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని అధికారులు మండిపడ్డారు. నిబంధనలు ఉల్లంఘించిన కొన్ని హోటళ్లు, టిఫిన్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారని తెలుస్తోంది. మరికొన్నింటికి షోకాజ్, మెరుగుదల నోటీసులు జారీ చేశారాని వినపడుతోంది. ప్రజలకు సురక్షితమైన ఆహారం అందించడమే తమ లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు. ఇలాంటి తనిఖీలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని, హోటళ్లలో తినే ముందు పరిశుభ్రతను గమనించాలని ప్రజలకు సూచించారు.

పాల్వంచ గాంధీనగర్ లో మూడో సెల్ టవర్.. ప్రజల ఆందోళన

■ రేడియేషన్ భయంలో గాంధీనగర్ ప్రజలు





కొత్తగూడెం కలెక్టరేట్ పాల్వంచ/నవంబర్7,(ప్రజా జ్యోతి) పాల్వంచ 44వ డివిజన్ గాంధీనగర్ లో ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న సెల్ టవర్ నిర్మాణం వివాదంగా మారింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో రెండు సెల్ టవర్లు ఉండగా మరొక సెల్ టవర్ను ముత్యాలమ్మగుడి సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా టవర్ పనులు చేపడుతుండడంతో స్థానికులు అడ్డుకొని ఆందోళన వ్యక్తం చేశారు,ఇప్పటికే ఉన్న సెల్ టవర్లతో గాంధీనగర్ ప్రజలు రేడియేషన్ తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పుడు మూడో టవర్ కూడా గుడి ముందే నిర్మిస్తే తమ ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, ఈ టవర్ నిర్మాణానికి అనుమతులు ఎవరు ఇచ్చారో చెప్పాలని, వెంటనే నిర్మాణ పనులను అధికారులు నిలిపివేయాలని గాంధీనగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని తక్షణమే మూడో సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపి వేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భూ రీసర్వే పనులను పారదర్శకంగా పూర్తి చేయాలి

► జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెంకలెక్టరేట్, నవంబర్ 7,(ప్రజా జ్యోతి) సుజాతనగర్ మండలం రాఘవపురం గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు చేపట్టిన సర్వే పనుల పురోగతిని, ప్రస్తుతం కొనసాగుతున్న సర్వే ప్రక్రియను సంబంధిత అధికారులు, సర్వే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.రాఘవపు రం గ్రామ పరిధిలో మొత్తం 1,800 ఎకరాల ఒక కుంట విస్తీర్ణంలో భూ రీ సర్వే నిర్వహించాల్సి ఉందని సర్వే అధికారులు కలెక్టర్కు వివరించారు. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం పరిధి, ప్రభుత్వ భూ ములు, గ్రామంలోని రహదారులకు సంబంధించిన సర్వే ప్రక్రియను పూర్తి చేసి వాటి హద్దులను నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం మిగిలిన భూములకు సంబంధించి సర్వే పనులను ప్రారంభించి కొనసాగిస్తున్నామని వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ భూ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సర్వే సమయం లో గ్రామంలోని భూముల వివరాలను పరిశీలించి, ప్రతి భూమికి సంబంధించిన హద్దులను కచ్చితంగా గుర్తించాలని తెలిపారు. ప్రభుత్వ భూములు, గ్రామకంఠం, ప్రైవేటు భూములు, రహదారుల హద్దుల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించాలని సూచించారు. సంబంధిత అధికారులు, సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచే స్తూ మిగిలిన భూ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించా రు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ కృష్ణ ప్రసాద్, సర్వేయర్ కిరణ్ కు మార్, సంబంధిత రెవెన్యూ, సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మా భూములకు పట్టాలిచ్చే వరకు ఆందోళన చేస్తాం





చంద్రుగొండ, నవంబర్07(ప్రజాజ్యోతి): సీలింగ్ భూములకు పట్టాలిచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని దామరచర్ల సీలింగ్ భూముల గిరిజన రైతులు స్పష్టం చేశారు.శనివారం చంద్రుగొండ తహసీల్ కార్యాలయం ఎదుట రెండో రోజు ఆందోళన కార్యక్రమంలో భాగంగా వంటవార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు మాట్లాడుతూ. 1990లో 42 మంది గిరిజన రైతులకు సీలింగ్ పట్టాలు ఇవ్వటం జరిగిందని, నాటి నుండి నేటి వరకు గిరిజనేతరుల కబ్జాలో ఉన్న భూములకు తమకు హక్కులు దక్కిలే చూడాలని, లోకాయుక్త సైతం ఆదేశాలు ఇవ్వటం జరిగిందని, రెవెన్యూ అధికారులు అలసత్వం వల్ల సమస్య జటిలంగా మారుతుందన్నారు. రెవెన్యూ అధికారులు సైతం పన్నెండు మంది గిరిజన రైతులకు సర్వే చేసి పట్టాలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు అధికారులు వెనుకనుడు వేయటం సరికాదన్నారు.ఇప్పటికైనా భేషజాలకు పోకుండా రెవెన్యూ అధికారులు వెంటనే మాభూముల సరిహద్దులు గుర్తించి, కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

సరస్వతి విద్యానికేతన్‌లో దీపావళి సందడి

■ సంప్రదాయాలు, భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం







చర్ల, నవంబర్ 07(ప్రజా జ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని తేగడలోని శ్రీ సరస్వతి విద్యానికేతన్‌లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ లిఖిత మాట్లాడుతూ దీపావళి కేవలం దీపాలు వెలిగించడం, టపాసులు కాల్చడం మాత్రమే కాదని, చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీక అని వివరించారు.ఈ సందర్భంగా 'ఒక దీపం ఇంట్లో వెలిగించు.. ఒక మంచి ఆలోచన మనసులో వెలిగించు..ఒక మంచి పని మరొకరి జీవితంలో వెలిగించు'అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు. కోపం, అసూయ, ద్వేషం, అహంకారం వంటి చెడు భావాలను విడిచిపెట్టి ప్రేమ, దయ, జ్ఞానం, మంచితనం అలవర్చుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో దీపాలు వెలిగిస్తూ చెడు లక్షణాలను విడిచిపెట్టి మంచి గుణాలను అలవర్చుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రాజేశ్వరి, శ్రీదేవి, పూజ మాట్లాడుతూ శ్రీరాముడు రావణాసురుడిని సంహరించి పద్నాలుగేళ్ల వనవాసం అనంతరం అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికిన కథను, శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించి ప్రజలకు విముక్తి కల్పించిన పురాణ గాథను వివరించారు. ఈ కథలు ధర్మం, సత్యం, మంచితనం ప్రాధాన్యతను తెలియజేస్తాయన్నారు.అరుణ విద్యార్థులకు పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చదువుతో జ్ఞానం, ప్రేమతో మానవత్వం, క్రమశిక్షణతో భవిష్యత్తు, నిజాయితీతో మంచి వ్యక్తిత్వం అనే దీపాలను వెలిగించుకోవాలని ఉపాధ్యాయుడు రమేష్ సూచించారు.బాణసంచా కాల్చేటప్పుడు పెద్దల పర్యవేక్షణ తప్పనిసరని, ఇళ్లు, వాహనాలు, రోడ్లు, విద్యుత్ తీగలకు దూరంగా టపాసులు కాల్చాలని, చేతిలో పట్టుకుని కాల్చకూడదని రమేష్ సూచించారు. పేలని టపాసుల దగ్గరకు వెళ్లకూడదని, నీళ్లు, ఇసుక, ప్రథమ చికిత్స సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. టపాసుల పొగ, శబ్దం వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారు, జంతువులు, పక్షులకు ఇబ్బందులు కలుగుతాయని, పర్యావరణహితంగా దీపావళి జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, రాజేశ్వరి, పూజ, ప్రమీల, శ్రీదేవితో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలు అందించేందుకు మరో అవకాశం

- జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 7,(ప్రజా జ్యోతి)కొత్తగూడెం జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి అందని గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ద్వంద్వ నమోదుల కేటగిరీకి చెందిన ఓటర్లకు మరోసారి అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అంకిత్ శనివారం తెలిపారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ కేటగిరీ కింద మొత్తం 1,32,785 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు, వీరిలో మరణించిన వారు 31,187 మంది, నివాసం మారిన వారు 78,253 మంది, ద్వంద్వ నమోదులు కలిగిన వారు 14,305 మంది, అందుబాటులో లేని వారు 8,733 మంది, ఇతర కేటగిరీకి చెందిన వారు 307 మంది ఉన్నారని తెలిపారు.ఈ నేపథ్యంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్లను సంప్రదించి, వారికి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని తెలిపారు. ఫారాలను పూర్తి చేసి సమర్పించేందుకు అవసరమైన సహకారం అందిస్తారని, ఫారాలను నేరుగా లేదా ఎన్నికల సంఘం ప్రత్యేక ఆన్ లైన్ వేదిక ద్వారా కూడా సమర్పించవచ్చని పేర్కొన్నారు.ఇప్పటికీ అదే నివాసంలో కొనసాగుతున్న ఓటర్లు అవసరమైన అనుబంధ పత్రం–బి జతచేసి, నివాసం మారిన ఓటర్లు తమ కొత్త చిరునామా వివరాలతో అనుబంధ పత్రం–సి జతచేసి ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించవచ్చని వివరించారు. ఇప్పటికే ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకున్నవారు తిరిగి ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో ద్వంద్వ నమోదులు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపడుతోందని, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటరు జాబితాలో చోటు కోల్పోకుండా అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ప్రతినిధులు కూడా ఎన్నికల సిబ్బందికి సహకరించాలని కోరారు.కావున, సంబంధిత ఓటర్లు తమ ప్రాంత బూత్ స్థాయి అధికారులను సంప్రదించి, అవసరమైన ఎన్యుమరేషన్ ఫారాలు, పత్రాలను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

రమేష్ సస్పెన్షన్ ను వెంటనే రద్దు చేయాలి

- తప్పుడు ఆరోపణలతో సస్పెన్షన్ చేయడం తొందర పాటు చర్య
- పి ఆర్ టీ యు టీ ఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు నర్సయ్య, భాస్కర్ డిమాండ్

పాల్వంచ, నవంబర్ 7, ప్రజాజ్యోతి:జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ ను తప్పుడు ఆరోపణలతో సస్పెన్షన్ చేయడం తొందరపాటు చర్య అని పి ఆర్ టీ యు టీ ఎస్ జిల్లా అధ్యక్షుడు పూనెం నర్సయ్య, ప్రధాన కార్యదర్శి భూక్య భాస్కర్ రావు తీవ్రం గా ఖండించారు. సదరు సస్పెన్షన్ ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి, రమేష్ కు పోస్టింగ్ కల్పించి న్యాయం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రమేష్ 2024లో బీపీఈడీ పరీక్షలకు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతితో హాజరయ్యారని తెలిపారు. ప రీక్షలకు హాజరైన కాలాన్ని అర్హజీతపు సెలవుగా పరిగణించి, సర్వీస్ బుక్ లో కూడా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రికార్డుల తారుమారు, జీతం చెల్లించాలని ప్రధానోపాధ్యాయుడిని బెదిరించారనే ఆరోపణలు పూర్తిగా కల్పితమని ఖండించారు.అప్పట్లో పనిచేసిన ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాశాఖ అధికారి ఇద్దరూ ఇప్పటికే పదవీ విరమణ చేశారని తెలిపారు. అయినప్పటికీ 2024లో జరిగిన అంశాలను కొందరి ప్రోద్బలంతో తిరిగి తెరపైకి తీసుకొచ్చి, ఏకపక్షంగా సస్పెన్షన్ విధించడం సమంజసం కాదన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి వెంటనే సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించుకొని, రమేష్ కు పోస్టింగ్ ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పూనెం నర్సయ్య, ప్రధాన కార్యదర్శి భూక్య భాస్కర్ రావు, పూనెం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమం

- వి బి జి రాంజీ పథకం ద్వారా పశుగ్రాస సాగుకు 100 శాతం ప్రభుత్వ ఆర్థిక సహాయం
- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి విద్యా చందన







కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 7, (ప్రజా జ్యోతి) జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పశుసంపదను సంరక్షించేందుకు వి బి జి రాంజీ పథకం కింద పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమం అమలు చేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా రైతుల వ్యక్తిగత భూముల్లో, అలాగే ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో పశుగ్రాసాన్ని సాగు చేసేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించనుందని తెలిపారు, 5 ఎకరాల కంటే తక్కువ వ్యవసాయ భూమి కలిగి ఉండి, సాగు భూమికి బోరు, కాలువ, చెరువు లేదా ఇతర మార్గాల ద్వారా నీటి సౌకర్యం ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. పశుగ్రాసం సాగు చేసేందుకు ఆసక్తి కలిగిన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.రైతులు తమ సొంత భూముల్లోనే పచ్చి మేతను పండించుకోవడం ద్వారా బయటనుంచి పశుగ్రాసం కొనుగోలు చేసే ఖర్చును తగ్గించుకోవచ్చని, పశువులకు నాణ్యమైన పచ్చిమేత అందించడం వల్ల వాటి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పాల ఉత్పత్తి పెరిగి రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని వివరించారు.పశుగ్రాస సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సామగ్రి ఖర్చులతో పాటు కూలీ ఖర్చులను కూడా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఒక ఎకరా విస్తీర్ణంలో పశుగ్రాసం సాగు చేసేందుకు అంచనా వ్యయం రూ. 18,882గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ పథకం కింద ఎర్రచెంగలి, నక్కతోక గడ్డి, నీడ గడ్డి, ఉప్పు గడ్డి, ఈటి గడ్డి వంటి పశుగ్రాస పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఎల్‌నినో కరువు పరిస్థితుల్లో పశువులకు తాగునీటి కొరత ఏర్పడకుండా గ్రామ పరిధిలో వి బి జి రాంజీ పథకం కింద నీటి తొట్ల నిర్మాణానికి కూడా అవకాశం కల్పించినట్లు విద్యాచందన తెలిపారు. పశువులు నీరు తాగేందుకు 5 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 0.6 మీటర్ల ఎత్తుతో నీటి తొట్ల నిర్మాణానికి రూ.43,000 అంచనా వ్యయంగా నిర్ణయించినట్లు వివరించారు.ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పశుసంపద సంరక్షణకు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నీటి వనరులు అందుబాటులో ఉన్నప్రాంతాల్లో వ్యక్తిగత భూముల్లో పశుగ్రాస సాగు, పశువులు, మేకలు, గొర్రెలకు తాగునీటి తొట్ల నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకానికి సంబంధించిన మరిన్ని వివరాలు, దరఖాస్తుల సమర్పణ కోసం సంబంధిత మండల పరిషత్ కార్యాలయాన్ని లేదా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

ఎల్‌నినో నివారణకు పాల్వంచలో జల సంరక్షణ చర్యలు ముమ్మరం

- తొగూడెం గ్రామపంచాయతీలో 30 వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణానికి స్థలాల గుర్తింపు



కొత్తగూడెం కలెక్టరేట్ , పాల్వంచ / నవంబర్ 7, (ప్రజా జ్యోతి) రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ అంకిత్ మార్గదర్శకాల మేరకు ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో భూగర్భ జలమట్టం పెంపు, వర్షపు నీటి సంరక్షణ లక్ష్యంగా కొత్తగూడెం జిల్లాలో ప్రత్యేక జల సంరక్షణ కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పాల్వంచ మండలంలోని తొగూడెం గ్రామ పంచాయతీలో శనివారం 30 వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణానికి స్థలాలను గుర్తించడంతో పాటు, 2 సామూహిక ఇంకుడు గుంత నిర్మాణానికి , కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ఏర్పాటుకు స్థలాలను గుర్తించారు. ఈ సందర్భంగా డిపిఓ అనుష మాట్లాడుతూజిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలలో సంతృప్త స్థాయిలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలవనరులను పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. జల సంరక్షణతో పాటు గ్రామీణ పారిశుద్ధ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు కూడా చర్యలు చేపడుతున్నారు.ఈ కార్యక్రమంలో బి.నాగ లక్ష్మి , ఎంపీఓ సైక్ షబ్నా, పంచాయతీ కార్యదర్శి రమేశ్ , సర్పంచ్ శుభ, ఉపసర్పంచ్ రాంబాబు , వీబీజీ రాంజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా బాలాజీ కల్యాణం

- పెంకె సాయికుమార్, రేవతి దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ
- బాలాజీ మాలధారణ స్వీకరించిన స్వాములు





అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 7, (ప్రజాజ్యోతి): అన్నపురెడ్డిపల్లి గ్రామంలో కొలు వై ఉన్నశ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం విశిష్టతను పురస్కరించుకొని ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ మేనేజర్ పి.వి.రమణ ఆదేశాల మేరకు స్వామివారి కల్యాణ వేడుకను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ అన్నప్రసాద కార్యక్రమాన్ని అన్నపురెడ్డిపల్లికి చెందిన పెంకె సాయికుమార్, రేవతి దంపతులు నిర్వహించారు. అదేవిధంగా పలువురు భక్తులు బాలాజీ మాలను ధరించి స్వామివారి దీక్షను స్వీకరించారు. బాలాజీ దీక్ష చేపట్టిన స్వాములు ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయంలో భక్తులకు అన్నప్రసాదం అందించడంతో పాటు ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఆస్పిరేషనల్ బ్లాక్ అభివృద్ధికి జపాన్ అధ్యయన పర్యటనతో అంతర్జాతీయ వేదికపై గుర్తింపు

- నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో జపాన్ అధ్యయన పర్యటనకు
- జిల్లా కలెక్టర్ అంకిత్ ఎంపిక
- ఈనెల 15 నుంచి 21 వరకు కలెక్టర్ అంకిత్ జపాన్లో పర్యటన



కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 7,(ప్రజా జ్యోతి) కొత్తగూడెం జిల్లా అభివృద్ధి ప్రస్థానంలో మరో విశిష్ట ఘట్టం ఆవిష్కృతమైంది. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో అమలవుతున్న ఆస్పిరేషనల్ బ్లాక్స్ కార్యక్రమంలో భాగంగా జిల్లా సమగ్ర అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు, వినూత్న పరిపాలనా విధానాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తీసుకుంటున్న ప్రత్యేక చర్యల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జపాన్ అధ్యయన పర్యటనకు ఎంపికయ్యారు.నీతి ఆయోగ్, జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ అండ్ బ్లాక్స్ అధ్యయన కార్యక్రమంలో భాగంగా నవంబర్ 15 నుంచి 21వ తేదీ వరకు జిల్లా కలెక్టర్ జపాన్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక అనుమతి మంజూరు చేసింది.

›» అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ

జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి అంతరాలను తగ్గించి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోంది. ముఖ్యంగా విద్య, వైద్యం, గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం, వ్యవసాయం, తాగునీరు, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పన వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. జిల్లాకలెక్టర్ అంకిత్ ఆధ్వర్యంలో అభివృద్ధిసూచికల ఆధారంగా ప్రాధాన్యతలను గుర్తించడం, వివిధ శాఖలకు నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించడం, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించడం, అధికారులతో నిరంతర సమీక్షలు నిర్వహించడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాల అమలును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు.ప్రభుత్వ సంకల్పమ, అభివృద్ధి పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయి పర్యవేక్షణకు ప్రాధాన్యతనిస్తూ, శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు, పోషకాహార భద్రత, మౌలిక వసతుల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నారు.

›» జపాన్లో ఆధునిక అభివృద్ధి నమూనాల అధ్యయనం

ఈ అధ్యయన పర్యటనలో భాగంగా జపాన్లో అమలవుతున్న ఆధునిక అభివృద్ధి నమూనాలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన పరిపాలనా వ్యవస్థలు, ప్రజాకేంద్రిత సేవలు, స్థానిక స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు, వినూత్న ప్రజాసేవల విధానాలను కలెక్టర్ అధ్యయనం చేయనున్నారు. జపాన్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను తెలంగాణ రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా, ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అన్వయించే అవకాశాలను పరిశీలించనున్నారు. ఈ పర్యటన ద్వారా అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న విజయవంతమైన అభివృద్ధి విధానాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, జిల్లాలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు నూతన ఆలోచనలు,కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకునే అవకాశం లభించనుంది.

›» జిల్లా అభివృద్ధికి మరో ముందడుగు

జిల్లా కలెక్టర్ అంకిత్కు లభించిన ఈ అంతర్జాతీయ అధ్యయన అవకాశం జిల్లా అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు దోహదపడనుంది. జిల్లా యంత్రాంగం సమష్టి కృషి, వివిధ శాఖల సమన్వయం, అభివృద్ధి లక్ష్యాల సాధనకు చేపడుతున్న కార్యక్రమాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ పర్యటన ఉపయోగపడనుంది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి కోసం కలెక్టర్ అంకిత్ చూపుతున్న ప్రత్యేక చొరవ, ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ, ప్రజాకేంద్రిత పరిపాలనకు ఈ అధ్యయన పర్యటన మరింత ప్రోత్సాహాన్ని అందించనుంది. జపాన్లో అధ్యయనం చేసే ఉత్తమ విధానాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా అమలు చేయడం ద్వారా ఆస్పిరేషనల్ బ్లాక్ పరిధిలో అభివృద్ధి సూచికలను మరింత మెరుగుపరచడంతో పాటు, జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పర్యటన ఒక ముఖ్యమైన అవకాశంగా నిలవనుంది.

అక్రమ ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

- ఇసుక రవాణా వాహనాన్ని పట్టుకొని గ్రామపంచాయతీ అధికారికి అప్పగింత



పాల్వంచ, నవంబర్ 7, ప్రజాజ్యోతి:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం దంతాలబోరు ఎస్సీ కాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని మొర్రెల వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా సంగం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈరోజు మొర్రెల వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని గుర్తించిన సంగం గ్రామస్తులు వెంటనే అడ్డుకొని పట్టుకున్నారు. అనంతరం సదరు వాహనాన్ని సంగం గ్రామపంచాయతీ జీపీఓకు అప్పగించినట్లు తెలిపారు.వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలింపును అరికట్టాలని, సంబంధిత అధికారులు స్పందించి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాల్వంచ శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా దీపావళి సంబరాలు

- భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు వివరించిన ఉపాధ్యాయులు



పాల్వంచ, నవంబర్ 7, ప్రజాజ్యోతి:పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెం శ్రీ చైతన్య పాఠశాలలో దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టత,భారతీయసంస్కృతి,సంప్రదాయాల గురించి వివరించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలారాణి మాట్లాడుతూ..దీపావళి అంటే దీపాల వరుస అని,సంస్కృతంలోని దీప,ఆవళి అనే పదాల కలయికతో ఈ పేరు ఏర్పడిందని తెలిపారు. అజ్ఞానంపై జ్ఞానం, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారని వివరించారు. శ్రీకృష్ణుడు సత్యభామ సహాయంతో నరకాసురుడిని సంహరించిన సందర్భంగా ప్రజలు ఆనందంతో దీపాలు వెలిగించారని, అలాగే రావణసంహారం అనంతరం శ్రీరాముడుసీతాసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతించారని తెలిపే కథలను విద్యార్థులకు వివరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్తగూడెం జోన్ ఏజీఎం వీరన్న మాట్లాడుతూ.. దీపావళి భారతీయ సంస్కృతికి ప్రతిబింబమని పేర్కొన్నారు.కుల,మత,వర్గ విభేదాలను పక్కనపెట్టి భారతీయులందరూ ఈ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. దీపావళి వెలుగులు మనలోని అజ్ఞానాన్ని తొలగించి నూతన ఉత్తేజాన్నినింపుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రైమరీ ఇన్ఛార్జ్ షేక్ సిరాజ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల డివిజన్ అధ్యక్షుడిగా సురేష్ నియామకం



చర్ల, నవంబర్ 07(ప్రజాజ్యోతి): మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామని భద్రాచలం డివిజన్ మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు ఎస్. సురేష్ అన్నారు.శనివారం చర్ల మండల కేంద్రంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామా అంజిరెడ్డి ఆదేశాల మేరకు నూతనంగా భద్రాచలం డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన సంత్పుర సురేష్ను మండల కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. సురేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమకారులందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానని వారి సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుతానని తన నియామకానికి రాష్ట్రకమిటీకి సిఫార్సు చేసిన చర్ల మండల ఉద్యమకారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సంఘాన్ని మరింత బలోపేతం చేసి ఉద్యమకారుల సంక్షేమం కోసంకృషిచేయాలని తీర్మానించారు. ఇటీవలఖమ్మం జిల్లాలో మృతి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్కు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఉద్యమకారులు భవిష్యత్తులో ఆత్మహత్యలకు పాల్పడకుండా ధైర్యంగా ఉండాలని, తమ సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కూరపాటి వీరాజు, వెంకటరమణ, చెన్నం శ్రీరామ్ మూర్తి, తరుణ్ రెడ్డి, శ్రీనివాసరావు, డి. జయరాం రెడ్డి, గొంది మోయన్న తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సాధికారత రాష్ట్ర స్థాయి పురస్కారాలు 2026 ప్రధానం కొరకు దరఖాస్తుల స్వీకరణ

కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 7 ,(ప్రజా జ్యోతి) అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం డిసెంబర్ 3, 2026 సందర్భంగా డైరెక్టర్, దివ్యాంగుల,వయోవృద్ధుల ,ట్రాన్స్ జెండర్స్ పర్సన్స్ సాధికారత శాఖ, హైదరాబాద్ వారి ఆదేశానుసారం కొత్తగూడెం జిల్లాలోని దివ్యాంగుల సాధికారత కోసం సేవలందిస్తున్న అర్హులైన వ్యక్తులు లేదా సంస్థల నుండి దరఖాస్తులను స్వీకరించినట్లు జిల్లా సంక్షేమ కార్యాలయానికి చెందిన అధికారులు శనివారం తెలిపారు , ఇందులో భాగంగా 1_వ్యక్తిగత కేటగిరి నందు_దివ్యాంగుల సాధికారత కోసం పనిచేస్తున్న వ్యక్తి, ఆదర్శ ప్రాయుడు, విశిష్ట సృజనాత్మక దివ్యంగ బాలుడు/బాలిక, దివ్యంగ రంగంలో పనిచేస్తున్న అత్యంత విశిష్ట పునరావాస నిపుణులు/సిబ్బంది, దివ్యాంగ రంగంలో అత్యంత విశిష్టత పరిశోధన ఆవిష్కరణ/ఉత్పత్తి/అభివృద్ధి గల కేటగిరి వారు. 2_సంస్థాగత కేటగిరి నందు_దివ్యాంగుల సాధికారత కోసం పనిచేస్తున్న అత్యుత్తమ సంస్థ, దివ్యాంగుల కోసం అత్యుత్తమ ప్లేస్మెంట్ ఏజెన్సీ. దరఖాస్తు విధానం, ఈ అవార్డులకు సంబంధించిన దరఖాస్తు నమూనా పూర్తి మార్గదర్శకాలను అధికారిక వెబ్సైట్ https://depwdsctgp.telangana.gov.in నుండి డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు, కావున, అర్హులైన వారు నిర్దేశిత గడువు ఈనెల 16-లోపు తమ దరఖాస్తులను తగిన ధ్రువీకరణ పత్రాలతో జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయానికి అందజేయాలని కోరారు.

ఏజెన్సీ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



భద్రాచలం ఐటిడిఏ పీవో బి. రాహుల్

భద్రాచలం, నవంబర్ 7 (ప్రజా జ్యోతి): దీపావళి పండుగను ఏజెన్సీ ప్రాంత ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య ఐకమత్యంగా జరుపుకోవాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆకాంక్షించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో గిరిజనులు, ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచి సాధించిన విజయానికి, చీకటిని పారద్రోలి వెలుగులు నింపే విజయానికి దీపావళి ప్రతీక అని పేర్కొన్నారు.గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు,గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. పిల్లలు టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ తగిన జాగ్రత్తలు పాటించేలా చూడాలని సూచించారు.

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

► అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

► భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు



భద్రాచలం, నవంబర్ 7 (ప్రజా జ్యోతి): ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్షి ,షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులు, అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, వార్డు సభ్యులు, ఎమ్మార్వో రవికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు ఎస్సీ సెల్ విభాగం నాయకుల సన్మానం

► పార్టీ బలోపేతానికి కృషి చేయాలి. ఎస్సీ సెల్ విభాగానికి ఎమ్మెల్యే సూచన



భద్రాచలం, నవంబర్ 7 (ప్రజా జ్యోతి): భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ ఎల్. వెంకట్ నరసయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును ఎస్సీ విభాగం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు.. జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు గద్దల రమేష్, జనరల్ కన్వీనర్ కొండూరి కిరణ్ కుమార్‌లను ఎమ్మెల్యే, వెంకట్ నరసయ్య సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎస్సీ విభాగం జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. దళితులకు అన్యాయం జరగకుండా అండగా ఉంటామని నాయకులు తెలిపారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తం రెడ్డి విజయానికి కృషి చేస్తామని వెల్లడించారు. దళితవాడల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు.ఈ నెల 13న నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరవుతానని హామీ ఇచ్చారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు గద్దల రమేష్ మండల, గ్రామ, మహిళా విభాగాల నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎస్సీ విభాగం నాయకులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

"మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" సంబరాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్

• శ్రీనగర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపాలు వెలిగించి, టపాసులు కాల్చిన కలెక్టర్





కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 7,(ప్రజా జ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి " సంబరాల కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన వసంత, ఉపేంద్ర, లీలావతి ఇళ్లలో నిర్వహించిన దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారుల కుటుంబసభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించారు. అనంతరం వారితో కలిసి దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి దీపావళి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. లబ్ధిదారులతో కలిసి పండుగ ఆనందాన్ని పంచుకుంటూ వారి సంతోషంలో భాగస్వాములయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఆనందం నింపాలని, ప్రతి ఇంటా వెలుగులు విరజిమ్మాలని ఆకాంక్షించారు. పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే సమయంలో ప్రతి ఒక్కరూ భద్రతా జాగ్రత్తలు పాటించాలని, టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సురక్షితంగా, ఆనందంగా దీపావళి పండుగను జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. సొంతింటిని నిర్మించుకోవడం ప్రతి పేదకు టుంబానికి ఎంతో గొప్ప కల అని, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ఆ కల నెరవేరుతుండటం సంతోషకరమని తెలిపారు. సొంత ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి పండుగలు జరుపుకోవడం ఎంతో ప్రత్యేకమైన అనుభూతిని కలిగిస్తుందని అన్నారు .ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సవేరాం, ఎంపీడీవో సంబంధిత శాఖల అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నీటిలో మునిగే వారికి ప్రాణదాత

♦ గల్లంతైన మృతదేహాల వెలికితీతలో అందెవేసిన చేయి..!

♦ గజ ఈతగాడు కరుకు ప్రసాదుకు మరోసారి ప్రశంసా పత్రం



భద్రాచలం, నవంబర్ 7 (ప్రజా జ్యోతి): గోదావరి నదిలో ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకు పోతున్న ఎంతోమంది ప్రాణాలను కాపాడుతూ, గల్లంతైన వారి మృతదేహాలను వెలికితీయడంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న భద్రాచలం పట్టణానికి చెందిన గజ ఈతగాడు కరుకు ప్రసాదు మరోసారి ప్రశంసలు అందుకున్నారు. ఎన్నో క్లిష్టమైన పరిస్థితుల్లో సైతం ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొంటూ పలువురి ప్రాణాలను కాపాడిన ఆ యన సేవలు అభినందనీయమని పలువురు కొనియాడుతున్నారు.ఈతలో విశేషనైపుణ్యం కలిగిన ప్రసాదు ఇప్పటి వరకు అనేక మంది ప్రాణాలను రక్షించడంతో పాటు, నదిలో గల్లంతైన వారి మృతదేహాలను వెలికితీసి బాధిత కుటుంబాలకు అందగా నిలిచారు. తన సేవలకు గుర్తింపుగా ఇప్పటికే పలు అవార్డులు, రివార్డులు అందుకున్న ఆయన తాజాగా శనివారం భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ చేతుల మీదుగా మరో ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా నిస్వార్థంగా సేవలందిస్తున్న కరుకు ప్రసాదును పలువురు అభినందిస్తున్నారు.

అశోక్ పార్థివదేహానికి బత్తుల అంజి నివాళులు



ములకలపల్లి, నవంబర్ 7 (ప్రజాజ్యోతి): మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన మిడియం వెంగళరావు కుమారుడు మిడియం అశోక్ అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందగా, శనివారం ఆయన పార్థివదేహానికి భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి నివాళులర్పించారు. అశోక్ మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల బీఎల్ఏ కోఆర్డినేటర్ సురభి రాజేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోయం బోడప్ప, మిడియం నారాయణ, మిడియం బుల్లెబ్బాయి, మాజీ ఎంపీటీసీలు మిడియం రాజులు, సున్నం సునీత, పాత్రికేయులు ఈర్ల రామ్మోహన్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గుంటూరు సాయిరాం, రామాచారి, షేక్ జానీ, సున్నం బుచ్చిబాబు తదితరులు నివాళులర్పించారు.

ఎవరి అనుమతితో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేశారు?

■ పక్కనే రాధిక కాన్సెప్ట్ స్కూల్.. భద్రతా చర్యలు తీసుకున్నారా?

■ అధికారులకు సమాచారం లేకుండానే దుకాణాల ఏర్పాటా..?

■ అనుమతులపై అధికారులను ప్రశ్నిస్తున్న పినపాక మండల ప్రజలు

పినపాక,నవంబర్ 07(ప్రజాజ్యోతి)పినపాక మండలంలోని ఏడుల్ల బయ్యారం క్రాస్ రోడ్‌లో సంత నిర్వహించే ప్రాంతంలో దీపావళి టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయడంపై స్థానిక ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఈ ప్రాంతంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఎవరు ఇచ్చారు? సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకున్నారా? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.ముఖ్యంగా టపాసుల దుకాణాలకు సమీపంలోనే రాధిక కాన్సెప్ట్ స్కూల్ ఉండటంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనసంచారం ఎక్కువగా ఉండే సంత ప్రాంతంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.టపాసుల దుకాణాల ఏర్పాటుకు సంబంధించి పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చారా? నిబంధనల ప్రకారం లైసెన్సులు, భద్రతా అనుమతులు పొందారా? అగ్నిప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు ఏర్పాటు చేశారా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, దుకాణాల ఏర్పాటుకు సంబంధించిన అనుమతులు, భద్రతా ప్రమాణాలను తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. పాఠశాల సమీపంలో ఇలాంటి దుకాణాల ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యం వహించకుండా విద్యార్థులు, ప్రజల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని పినపాక మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.అధికారులు స్పందించి అనుమతులపై వాస్తవాలను వెల్లడిస్తారా? లేక ప్రజల ఆందోళనలను పట్టించుకోకుండా పదిలేస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.



కులాల పట్టింపులే.. నిండు చూలాలుని మింగేశాయి!

వేర్వేరు సామాజిక వర్గాలు కావడమే భవాని ప్రాణాలకు శాపమైందా?

- **గర్భవతి అని కూడా చూడకుండా చేతులతో నులిమి.. చున్నీతో గొంతు బిగించి కిరాతక హత్య**
- **తండ్రితో కలిసి వ్యవసాయ పొలంలో దాచి.. ఆపై మోటార్ సైకిల్‌పై తీసుకెళ్లి గోదావరిలో పడేసి!**
- **మిస్సింగ్ కేసు ఛేదించిన త్రీ టౌన్ పోలీసులు.. నిందితుడు ఏఆర్‌పీసీ నరేందర్ అరెస్ట్, రిమాండ్**
- **లవ్ మ్యారేజ్ చేసుకొని నిండు చూలాలును బలితీసుకున్న ఉదంతంపై ప్రెస్ మీట్**
- **పూర్తి వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్ 07, (ప్రజా జ్యోతి):
ప్రేమకు కులాలు, మతాలు అడ్డంకి కావని భావించి ఒకటైన ఆ దంపతుల అనుబంధం చివరకు రక్తసిక్తమై ముగిసింది. వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన వారు కావడంతో కుటుంబంలో మొదలైన కలతలు, పట్టింపులే ఒక నిండు ప్రాణాన్ని, కడుపులో ఎదుగుతున్న పసి ప్రాణాన్ని అత్యంత కిరాతకంగా పొట్టనబెట్టుకున్నాయి. సమాజంలో చట్టాన్ని కాపాడాల్సిన పోలీసు ఉద్యోగే.. కుల భావజాలం, కుటుంబ అసంతృప్తుల నేపథ్యంలో కనుపాపలా చూసుకోవాల్సిన భార్యను కసాయిలా హతమార్చిన ఘోర ఉదంతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని రేకెత్తించింది. ఈ దారుణ హత్య కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ వెల్లడించారు.

చేతులతో నులిమి, చున్నీతో గొంతు బిగించి నిండు చూలాలు బలి

పోలీసుల దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండలం గోలియాతండాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ (ఎ ఆర్ పి సి -623) బోడా నరేందర్ (30), భవాని వేర్వేరు సామాజిక వర్గాలకు చెందినవారు అయినప్పటికీ ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. అయితే వీరి సామాజిక వర్గాలు వేర్వేరుగా ఉండటం నిందితుడి కుటుంబ సభ్యులకు ఎంత మాత్రం నచ్చలేదు. ఈనేపథ్యంలోనే దంపతుల మధ్య తీవ్ర మనస్పర్థలు, గొడవలు ప్రారంభమయ్యాయి. ఇక గత ఆరో తేదీన భవాని సోదరి గుండారపు స్వరూప త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో తన చెల్లెలు కనిపించడం లేదని ఫిర్యాదు చేయడంతో పోలీసులు క్రైమ్ నంబర్ 205/2026 కింద మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సందేహాస్పదంగా మారిన భర్త నరేందర్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఈ నెల 3వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో కొత్తగూడెంలోని తమ అద్దె ఇంట్లో భార్య భవానితో గొడవపడి, ఆమెను చేతులతో నులిమి, చున్నీతో గొంతు బిగించి అత్యంత నరరూప రాక్షసత్వంతో హత్య చేసినట్లు నరేందర్ అంగీకరించాడు.

తండ్రి సహాయంతో గోదావరి నదిలో మృతదేహం కలిపేసి!

ఇక హత్య చేసిన అనంతరం నేరాన్ని కప్పిపుచ్చేందుకు నిందితుడు నరేందర్ పక్కా పథకం వేశాడు. మృతదేహాన్ని ఒక తెల్లని సంచిలో కుక్కి, తన స్వగ్రామమైన గోలియాతండాకు తరలించి, కన్నతండ్రి హరిలాల్ సహాయంతో వ్యవసాయ పొలంలో దాచిపెట్టాడు. ఆ మరుసటి రోజు (నవంబర్ 4న) రాత్రి 11 గంటల సమయంలో తండ్రీకొడుకులిద్దరూ కలిసి మోటార్ సైకిల్‌పై భద్రాచలం గోదావరి బ్రిడ్జి వద్దకు చేరుకుని, సాక్ష్యాలను మాయం చేసే ఉద్దేశంతో మృతదేహాన్ని నదిలోకి విసిరేశారు. నిందితుడు ఇచ్చిన పక్కా సమాచారంతో పోలీసులు పంచుల సమక్షంలో గోదావరి నదిలో గజ ఈతగాళ్లతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టి భవాని మృతదేహాన్ని వెలికితీశారు. ఇక ఈ కేసులో నిందితుడు బోడా నరేందర్‌ను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఈ హత్య వెనుక ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా అనే కోణంలో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని, నేరానికి పాల్పడిన వారెవరినీ విడిచిపెట్టేది లేదని చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొంత సంక్లిష్టంగా మారిన ఈ మిస్సింగ్ కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, త్రీ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి, వన్ టౌన్ సీఐ జితేందర్, అన్నపురెడ్డిపల్లి ఎస్ఐ విజయ్ సింహారెడ్డి, త్రీ టౌన్ ఎస్ఐ రమేష్‌లతో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

కుల రక్కసికి ఇంకెన్ని బలులు?

సాంకేతిక పరిజ్ఞానం విపరీతంగా పెరిగి ఆధునిక యుగంలో విహరిస్తున్నా మనుషుల మనస్సులను ఏలుతున్న 'కుల రక్కసి' మాత్రం ఇంకా సమసిపోలేదు అనడానికి భవాని దారుణ హత్యాకాండే ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. వేర్వేరు సామాజిక వర్గాలు కావడం వల్ల కుటుంబంలో ఎదురైన తీవ్ర వ్యతిరేకత, పట్టింపులే చివరికి ఒక పచ్చని సంసారాన్ని కాలరాత్రిగా మార్చి వేసి నిండు చూలాలు అని కూడా చూడకుండా బలితీసుకున్నాయి. చట్టం, న్యాయంపై పూర్తి అవగాహన ఉండాల్సిన ఒక పోలీసు ఉద్యోగే కుల భావజాలం మాయలో పడి చేతులతో నులిమి భార్యను చంపడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ప్రేమించినంత సులువుగా ప్రాణాలు తీసే సంస్కృతి సమాజంలో పెరిగిపోతుండటం నైతిక విలువల పతనానికి నిదర్శనమని, కులాల అడ్డుగోడల కంటే మానవత్వమే గొప్పదని గ్రహించినప్పుడే ఇలాంటి దారుణాలకు అడ్డుకట్ట పడుతుంది.

ఫైర్ సేఫ్టీ లేదు.. భద్రతా చర్యల ఊసే లేదు!

దుకాణాలు పెట్టారు.. ప్రమాద నివారణను గాలికొదిలేశారు!

ఇసుక బకెట్లు లేవు.. వాటర్ డ్రమ్స్ పెట్టి చేతులు దులుపుకుంటున్న వైనం



అశ్వారావుపేట ప్రజా జ్యోతి నవంబర్ 7 అశ్వారావుపేట మండలంలోని పలు బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు.. వ్యాపారాలు సాగిస్తున్నారు.. కానీ ప్రజల భద్రత విషయంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అగ్నిప్రమాదాలు సంభవిస్తే తక్షణమే స్పందించేందుకు అవసరమైన కనీస ఫైర్ సేఫ్టీ పరికరాలు కూడా కొన్ని దుకాణాల్లో కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక బకెట్లు ఏర్పాటు చేయాల్సిన చోట వాటర్ డ్రమ్స్ పెట్టి, అందులో నీళ్లు నింపి ఉంచితే అదే ఫైర్ సేఫ్టీనా? నీళ్లు ఉన్నా వాటిని ఉపయోగించేందుకు బకెట్, మగ్గు వంటి కనీస సదుపాయాలు లేకపోతే ప్రమాద సమయంలో ఎలా స్పందిస్తారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏదైనా అగ్నిప్రమాదం జరిగి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిన తర్వాత అధికారులు స్పందిస్తే ప్రయోజనం ఏమిటి? ముందస్తు తనిఖీలు నిర్వహించి భద్రతా లోపాలను గుర్తించాల్సిన అధికారులు ఎక్కడున్నారు? దుకాణాలకు అనుమతులు ఇచ్చే సమయంలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తున్నారా? లేక ప్రమాదం జరిగిన తర్వాతే హడావుడి చేస్తున్నారా? వ్యాపారులకు ఆదాయం ముఖ్యం కావచ్చు.. కానీ అక్కడికి వచ్చే వినియోగదారుల ప్రాణాలకు భద్రత కల్పించడం కూడా అంతే ముఖ్యం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, నిబంధనల ప్రకారం అవసరమైన అగ్నిమాపక పరికరాలు, ప్రమాద నివారణ సదుపాయాలు ఉన్నాయో లేదో పరిశీలించాలి. అని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

సంతలో సందడి చేసిన ఎమ్మెల్యే జారె





ములకలపల్లి, నవంబర్ 7 (ప్రజాజ్యోతి): మండలంలోని జగన్నాధపురం గ్రామంలో నిర్వహించే శనివారపు సంతను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సందర్శించి సందడి చేశారు. ఈ సందర్భంగా సంతకు వచ్చిన గిరిజన గ్రామాల ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చే సంతలో వ్యాపారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు విక్రయిస్తున్న చిరు వ్యాపారుల వద్దకు వెళ్లి అమ్మకాలు, కొనుగోళ్లు, వ్యాపార పరిస్థితులపై ఆరా తీశారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా కల్పించారు. ఎలాంటి అధికారిక హడావుడి లేకుండా నేరుగా ప్రజల మధ్యకు వెళ్లి వారితో ఆప్యాయంగా ముచ్చటించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎమ్మెల్యే తమ మధ్యకు రావడంతో సంతకు వచ్చిన ప్రజలు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు.

"లో వోల్టేజ్" సమస్యకు శాశ్వత పరిష్కారం

- **25 కేవీ నూతన డీటీఆర్ ఏర్పాటు – ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యం**
- **ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్పంచ్ లావుడియా పూర్ణ**




లక్ష్మీదేవి పల్లి, నవంబర్ 7 ,ప్రజా జ్యోతి: లక్ష్మీదేవి పల్లి మండల కేంద్రంలోని రేగళ్ల పెద్దతండ గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న "లో వోల్టేజ్ "సమస్యకు పరిష్కారం చూపే దిశగా సర్పంచ్ లావుడ్య పూర్ణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి, గ్రామంలో 25 కేవీ సామర్థ్యం గల నూతన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్)ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావుడ్య పూర్ణ మాట్లాడుతూ... గ్రామంలో ప్రజలకు "లో వోల్టేజ్ "సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే మా ప్రధాన లక్ష్యమని తెలిపారు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, స్వయంగా లైన్‌మెన్‌ను వెంట తీసుకొని క్షేత్రస్థాయిలో పర్యటించి, వీధి దీపాల కేబుల్ వైర్లు, నూతన విద్యుత్ స్తంభాలు, డీటీఆర్‌ల ఏర్పాటుకు అవసరమైన అంచనాలను సిద్ధం చేయించిన విషయం గ్రామ ప్రజలకు తెలిసిందేనని గుర్తు చేశారు. ఆ కృషిలో భాగంగానే ఈరోజు గ్రామంలో నెలకొన్న "లో వోల్టేజ్" సమస్యను పరిష్కరించేందుకు 25 కేవీ నూతన డీటీఆర్‌ను ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. ప్రజా సమస్య ఏదైనా అది చిన్నదైనా, పెద్దదైనా నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించడమే ప్రజాపాలనకు నిజమైన అర్థం. గ్రామ ప్రజలకు మెరుగైన విద్యుత్ సదుపాయాలు కల్పించేందుకు భవిష్యత్తులోనూ నిరంతరం కృషి చేస్తానని సర్పంచ్ లావుడ్య పూర్ణ స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తూ గ్రామ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సర్పంచ్ చొరవపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరో ప్రాణం పోతేనే అధికారులకు కనువిప్పా?

- గౌతమి నగర్ కాలనీ గేటు వద్ద రెండు బైకులు ఢీ.. ఒకరి పరిస్థితి విషమం!
- డివైడర్లు లేక నిత్యం ప్రమాదాల భయం..
- పట్టించుకోని ఆర్ అండ్ బీ అధికారులు
- రహదారి విస్తరణ స్థలంలో షాపుల ఆక్రమణలు.. చోద్యం చూస్తున్న గ్రామపంచాయతీ!
- పత్రికల్లో ఎన్ని సార్లు కథనాలు వచ్చినా మారని అధికారుల తీరు!





అశ్వాపురం, నవంబర్ 6,ప్రజాజ్యోతి

అశ్వాపురం మండల కేంద్రంలోని గౌతమి నగర్ కాలనీ గేటు వద్ద రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. తాజాగా రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా మారినట్లు సమాచారం. ఈ ఘటనతో స్థానిక ప్రజలు మరోసారి తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో కనీస రహదారి భద్రతా చర్యలు లేకపోవడం వల్ల వాహనదారుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

›» డివైడర్లు లేక ప్రమాదాలకు స్వాగతం పలుకుతున్నారా?

గౌతమ్ నగర్ కాలనీ గేటు వద్ద రహదారిపై వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. కాలనీ నుంచి బయటకు వచ్చే వాహనాలు, ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనాలు ఒకే ప్రాంతంలో కలుస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి కీలకమైన ప్రాంతంలో రహదారికి ఇరువైపులా డివైడర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.డివైడర్లు లేకపోవడంతో వాహనదారులు తమకు నచ్చిన విధంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలను నియంత్రించే పరిస్థితి లేకపోవడంతో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేయడం తప్ప, ముందస్తు నివారణ చర్యలు చేపట్టడంలో అధికారులు ఎందుకు విఫలమవుతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

›» ఇంకెంతమంది ప్రాణాలు కోల్పోవాలి?

ఒకసారి కాదు.. పలుమార్లు ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత ఆర్ అండ్ బీ అధికారుల్లో చలనం లేకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. పత్రికల ద్వారా సమస్యను ఎన్నిసార్లు వెలుగులోకితీసుకొచ్చినా క్షేత్రస్థాయిలో మార్పు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? ప్రమాదం జరిగిన తర్వాత స్పందిస్తారా? లేక ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటారా? అని నిలదీస్తున్నారు.ఒక ప్రమాదంలో ఒక కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోతుంది. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి ప్రమాదానికి గురైతే ఆ కుటుంబం జీవితమే అస్తవ్యస్తమవుతుంది. ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకముందే అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

›» రహదారి విస్తరణ స్థలంలో షాపులు.. పంచాయతీ అధికారులకు కనిపించడం లేదా?

ఇక గౌతమి నగర్ కాలనీ పరిసరాల్లో మరో సమస్య ప్రజలను వేధిస్తోంది. రహదారి విస్తరణ కోసం స్థలాన్ని కేటాయించినప్పటికీ, ఆ స్థలంలోనే కొందరు షాపులు ఏర్పాటు చేసుకుని రహదారిపైకి వస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రహదారి అందుబాటు తగ్గి వాహనదారులకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారి విస్తరణ ఉద్దేశమే దెబ్బతింటుండగా, ఆక్రమణలపై గ్రామపంచాయతీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఆక్రమణలను గుర్తించి తొలగించాల్సిన బాధ్యత గ్రామపంచాయతీ అధికారులపై ఉన్నప్పటికీ, సమస్యను పట్టించుకోకుండా వదిలేయడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రహదారిపై షాపులు వెలుస్తున్నా, వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతున్నా అధికారులు మౌనం వహించడం వెనుక కారణమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

›» పత్రికల్లో కథనాలు వచ్చినా.. కదలని అధికార యంత్రాంగం!

ఈ సమస్యలపై గతంలోనూ పలుమార్లు పత్రికల ద్వారా కథనాలు ప్రచురితమయ్యాయి. అయినప్పటికీ సంబంధిత శాఖల అధికారులు కనీస స్పందన చూపకపోవడం గమనార్హం. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు స్పందించినట్లు కనిపించి, ఆ తర్వాత సమస్యను మళ్లీ గాలికి వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

›» ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి!

ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు గౌతమ్ నగర్ కాలనీ గేటు ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించాలి. రహదారి పరిస్థితిని అంచనా వేసి అవసరమైన చోట డివైడర్లు ఏర్పాటు చేయాలి. ప్రమాద సూచిక బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు, వాహనాల రాకపోకలకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి. రహదారి విస్తరణకు కేటాయించిన స్థలంలో ఉన్న ఆక్రమణలను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి.ప్రజలప్రాణాలుపోయినతర్వాతపరామర్శలు చేయడం కాదు.. ప్రాణాలు పోకుండా ముందస్తు చర్యలుతీసుకోవడమే అధికారుల బాధ్యత. మరో ప్రమాదం జరిగి మరో కుటుంబం రోడ్డున పడకముందే ఆర్ అండ్ బీ, గ్రామపంచాయతీ అధికారులు మేల్కొని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గౌతమి నగర్ కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పాల్వంచ మండలంలో ఉద్రిక్తత

- వృద్ధుడిపై చెప్పతో దాడి, కత్తితో బెదిరింపులు
- కోడిపుంజులవాగు గ్రామంలో ఘటన
- రూరల్ పోలీస్ స్టేషన్లో బాధితుడు తేజావత్ సక్రు ఫిర్యాదు

కొత్తగూడెం కలెక్టరేట్,పాల్వంచ/నవంబర్ 7,(ప్రజా జ్యోతి) పాల్వంచ మండలం పరిధిలోని కోడిపుంజులవాగు గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో చోటుచేసుకున్న ఘర్షణ స్థానికంగా కలకలం రేపింది. ఓ వృద్ధుడిపై దుండగులు దాడికి పాల్పడి, కత్తితో చంపుతానని బెదిరించిన ఘటనపై బాధితుడు శనివారం పోలీసులను ఆశ్రయించాడు. ఇందుకు సంబంధించిన వివరాలుబాధితుడు తేజావత్ సక్రు సాదు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన తేజావత్ సక్రు నవంబర్ 6 న మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన తేజావత్ పార్వతి ఇంటి ముందు, తేజావత్ శ్రీనుతో కలిసి కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన భూక్య నరేష్ తండ్రి రాంజీ) అక్కడికి వచ్చి సక్రును బూతులు తిట్టడం ప్రారంభించాడు."ఎందుకు నన్ను తిడుతున్నావ్?" అని సక్రు నిలదీయగా ... తన అన్న తనకు డబ్బులు ఇస్తా అంటే నువ్వే ఇవ్వకుండా అడ్డుపడుతున్నావంటూ నరేష్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. సక్రు , శ్రీనులు అతన్ని వారించే ప్రయత్నం చేయగా, నరేష్ తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతూ తన చెప్పు తీసుకొని సక్రు చెంపపై కొట్టాడు.అంతటితో ఆగకుండా, అదే సమయంలో అక్కడ ఉన్న తేజావత్ శ్రీను షాపులో నుంచి కత్తి తీసుకుని సక్రు పైకి వచ్చి "నిన్ను ఈరోజు ఎలాగైనా చంపేస్తా" అంటూ ప్రాణభయం కల్గించేలా బెదిరించాడు. దీంతో భయపడిపోయిన సక్రు అక్కడి నుంచి తన ఇంటికి వెళ్లిపోయాడు.అయితే,అదే రోజు సాయంత్రం 7 గంటల ప్రాంతంలో నిందితుడు నరేష్ మళ్లీ కత్తి పట్టుకుని సక్రు ఇంటికి వెళ్లాడు. అక్కడ సక్రు కనిపించకపోవడంతో, ఆయన భార్య ద్వాలితో గొడవపడి ఆమెను కూడా చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులతో సంప్రదించి, విషయన్ని బేరీజు వేసుకుని ఆలస్యంగా స్టేషన్‌కు రావడం జరిగిందని బాధితుడు తెలిపారు. తనపై బూతులు తిడుతూ చెప్పుతో కొట్టి, కత్తితో చంపుతానని బెదిరింపులకు పాల్పడిన భూక్య నరేష్ , ఇతరులపై తక్షణమే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్‌ఓకు ఫిర్యాదు చేశారు, ఈ మేరకు పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వెలుగుల దీపావళి పండుగ

- ఆనందోత్సవాలతో పండగలు జరుపుకునేందుకు క్రాకర్స్ ను కొనుగోలు చేస్తున్న ప్రజలు

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 7,(ప్రజా జ్యోతి)

భారతీయ సంస్కృతిలో దీపావళిని అన్ని వర్గాల ప్రజలు ఎంతో ఘనంగా దీపాల పండుగ గా జరుపుకుంటారు, దీపావళి పండుగ అంటే అంధకారంపై వెలుగు చెడు పైనుంచి విజయం సాధించినందుకు ప్రతీకగా ఈ దీపావళి పండుగను ప్రతి ఒక్కరు జరుపుకుంటారు, దీపావళి పండగ యొక్క ప్రత్యేక విశిష్టతల లో భాగంగా దక్షిణ భారతదేశంలో శ్రీకృష్ణుడు సత్యభామ సహకారంతో నరకాసురుడని రాక్షసుడుని వధించిన రోజుకు గుర్తుగా నరక చతుర్దశి దీపావళి పండుగను ఘనంగా జరుపుకుంటూ ఉంటారు, లంకలోని రావణాసురుని సంహరించి శ్రీరాముడు సతి సమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా అయోధ్య ప్రజలు ఆనందోత్సవాలతో దీపాలు వెలిగించి స్వాగతం పలికారని పురాణం చెప్తుంది, అదేవిధంగాఅమావాస్య రోజున సంపదలకు అది దేవత అయిన లక్ష్మీదేవిని, కుబేరుడిని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజిస్తారు , ప్రతి ఇళ్లలో నువ్వుల నూనెతో ,లేదా నెయ్యితో ప్రమిదలు వెలిగిస్తూ ఆధ్యాత్మికతను చాటుకుంటున్నారు, అరిషడ్వర్గాల కామ, క్రోధ ,లోభ, మెహ, మెహ మద మాత్సర్యాలు అంతర్గతచీకట్లను పారద్రోలిజ్ఞానమునే వెలుగులను ఆహ్వానించడమే ఈ పండుగ అసలు పరమార్థముగా చెప్పుకుంటూ ఉంటారు, ఈ దీపావళి పండుగ "5" రోజులపాటు విశేషంగా ఉంటుంది,



ఇందులో ముఖ్యంగా 1:ధన త్రయోదశి _ ధన్వంతరి జయంతిన ప్రతి ఒక్కరు బంగారం వెండి లేదా కొత్త వస్తువులు కొనడం శుభ ప్రదంగా భావిస్తుంటారు, 2: మరక చతుర్దశి, చోటి దీపావళి __ అభ్యంగన స్నానాలు చేసి యమధర్మరాజును తలుచుకుంటూ దక్షిణ దిశగా యమ దీపం వెలిగిస్తారు, 3' దీపావళి అమావాస్య ప్రధాన పండుగ రోజు ఇళ్లల్లో దీపాలు వెలిగించి లక్ష్మీ పూజలు చేస్తారు, అదేవిధంగా బాణా సంచాను కాలుస్తూ ఆనందోత్సవాల నడుమ నిర్వహిస్తుంటారు, 4: బలి పద్యమి: గోవర్ధన పూజ _ గోవర్ధన గిరి పూజ అదే విధంగా బలి చక్రవర్తిని స్మరించుకునే రోజు ఇది అని చెప్పవచ్చు, 5: భగిని హస్త భోజనం, అన్నా చెల్లెల అనుబంధానికి ప్రత్యేకంగా ఈ పండుగ రోజున సోదరులు తమ సోదరీమణుల ఇంటికి వెళ్లి భోజనాలు ఆరగిస్తుంటారు, అదేవిధంగా నేడు దీపావళి పండుగ సందర్భంగా ప్రతి ఒక్క



వ్యాపారస్తులు తమ షాపుల వద్ద ప్రత్యేకంగా దీపాలను వెలిగిస్తూ, విద్యుత్ దీపాలతో అలంకరించి అరటి తోరణాలు ఉంచి బాణా సంచాను కాలుస్తూ పండుగను ఎంతో ఘనంగా జరుపుకుంటారు.